క్లుప్తంగా

2నుంచి ఉమ్మడి జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు

నడిగూడెం : మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వచ్చే నెల 2నుంచి దసరా పండుగ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి ఖమ్మం జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండు మహేంధర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందే విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30,016, ద్వితీయ బహుమతి రూ.20,016, తృతీయ బహుమతి రూ.15,016 అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 9346848034, 7093119611ను సంప్రదించి, తమ జట్టు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహాల ఊరేగింపు



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలో నూతనంగా ప్రతిష్ఠించిన అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులను ఆదివారం అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. నేరేడుచర్ల ప్రముఖ వ్యాపారి కొణతం కృష్ణారెడ్డి -సంధ్య దంపతులు స్థలాన్ని విరాళంగా ఇవ్వగా దాతల సహకారంతో స్వామివారి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణం జరిగి 41రోజులు పూరైన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, మహాపడి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టణంలో మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో ప్రధాన వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొనతం చినవెంకటరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, గురుస్వామి చిన్నపల్లి శ్రీనివాస్, యారవ సురేష్, కిశోర్, దుర్గారావు, దొంతిరెడ్డి వెంకటరమణారెడ్డి, లక్ష్మారెడ్డి, పూర్ణచంద్రరెడ్డి, గజ్జల కోటేశ్వర్‌రావు, ఐల శ్రీను, శావయ్య, రాము, కిషన్ తదితరులున్నారు.


నేవీ రాడార్ స్టేషన్‌తో పర్యావరణానికి హాని

గరిడేపల్లి : దామగుండం ఫారెస్ట్‌లో చెట్లను తొలగించి దానిలో నేవీ రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడంతో పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతుందని బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొజ్జ పవన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే వికారాబాద్ అడవుల్లో సహజ వనరులు, ఆహ్లాదకర వాతావరణం కోల్పోవడం, వన్య ప్రాణుల మనుగడకు ముప్పు కలగడం వంటి సమస్యలు ఏర్పడతాయని ఆయన తెలిపారు.

రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి

నడిగూడెం : ప్రభుత్వం రైతుబంధు పథకానికి వెంటనే నిధులు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం మండల పరిధిలోని బృందావనపురంలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతులను ఇబ్బందులు పెడుతుందన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మిట్టగణుపు ముత్యాలు, నాయకులు కొరట్ల శ్రీనివాస్, బొడ్డు వెంకటనారాయణ, కాసాని సోమయ్య, బొడ్డు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం అభివృద్ధికి కృషిచేయాలి



రెడ్డి అన్నదానం సత్రం భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సభ్యులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలోగల రెడ్డి అన్నదాన సత్రం అభివృద్ధికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రెడ్డి కుల బంధువులు కృషిచేయాలని సత్రం కమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వర రెడ్డి కోరారు. ఆదివారం స్థానికంగా సత్రంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు వచ్చే వేలాది మంది భక్తులకు సౌకర్యంగా ఉండేందుకుగాను నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ స్లాబును కమిటీ సభ్యులు పరిశీలించారు. సత్రం నిర్మాణానికి రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ కొండేటి లక్ష్మి రూ.60వేలు, హుజూర్‌నగర్‌కు చెందిన పశ్యా శ్రీనివాసరెడ్డి రూ.10,016లు విరాళంగా ప్రకటించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి చిట్టెం నాగిరెడ్డి, సభ్యులు చౌదరిరెడ్డి, శంభిరెడ్డి, చక్రారెడ్డి, లక్ష్మి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మట్టారెడ్డి పాల్గొన్నారు.

నిరుపయోగంగా పునరావాస కాలనీ

- కాలనీలో దట్టంగా పెరిగిన కంపచెట్లు
- శిథిలావస్థకు చేరిన పలు ప్రభుత్వ భవనాలు
- ఇళ్లు నిర్మించి న్యాయం చేయాలని నిర్వాసితుల వేడుకోలు



నిరుపయోగంగా పునరావాస కాలనీ



కమ్యూనిటీహాల్ భవనం చుట్టూ అల్లుకున్న కంపచెట్లు



శిథిలావస్థకు చేరుతున్న పాఠశాల భవనం



పునరావాస కాలనీలో నిర్మించిన సీసీరోడ్డు

మఠంపల్లి : పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో మండలంలోని మట్టపల్లిని ముంపు గ్రామంగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో గ్రామంలోని బాధితులను వేరే ప్రాంతానికి తరలించి పునరావాసం కల్పించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధిలో గల సుల్తాన్‌పూర్‌తండా వద్ద ప్రధాన రహదారి పక్కన నిర్వాసితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వం పునరావాస కేంద్రాన్ని కేటాయించింది కాని నేటికీ ఎలాంటి ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆ స్థలం నిరుపయోగంగా మారింది. మట్టపల్లి గ్రామం కృష్ణానది ఒడ్డున ఉండడంతో ఆనాటి అధికారులు గ్రామాన్ని పూర్తి ముంపుగా గుర్తించకుండా కొంత భాగమే ఫుల్ రిజర్వాయర్ లెవల్ (ఎఫ్‌టీఎల్)కు తాకుతుందని సుమారు 129కుటుంబాలు ముంపుకు గురవుతాయని తేల్చి వారికి మాత్రమే నష్టపరిహారం చెల్లించి ఈ పునరావాస కాలనీని కేటాయించింది. అయితే గ్రామంలో ఎక్కువ మంది కార్మికులు, మత్స్యకారులు, ఆలయ అర్చకులు, కొద్దిమంది రైతులతో కలిసి సుమారు 200కుటుంబాల వరకు ఉన్నాయి. దీంతో గ్రామస్తులు ముంపులో భాగంగా గ్రామం అంతా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అయితే అధికారులు అలా చేయకుండా 129మందిని మాత్రమే గుర్తించి వారికి సుల్తాన్‌పూర్‌తండా సమీపంలో స్థలాన్ని కేటాయించారు. అంతటితో ఆగకుండా పునరావాస కాలనీలో సీసీరోడ్లు, వాటర్‌ట్యాంకు, పాఠశాల భవనం, కమ్యూనిటీ భవనం తదితర నిర్మాణాలు చేపట్టారు. కాని దశాబ్ద కాలం గడిచినా నేటికీ బాధితులకు పునరావాస కాలనీలో ఇళ్లు మాత్రం నిర్మించలేదు. ఇదే మండలంలోని ముంపు గురైన మరో రెండు గ్రామాల్లో (గుండ్లపల్లి, సుల్తాన్‌పూర్‌తండా)కాలనీలు నిర్మించారు. అయితే మట్టపల్లిలో ఉన్న అందరికి నష్టపరిహారం, ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్‌తో కాలనీలో ఇప్పటికీ ఒక్క ఇల్లు కూడా నిర్మాణం జరగలేదు. దీంతో కాలనీలో దట్టంగా కంపచెట్లు పెరిగి నిర్మించిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే పునరావాస కాలనీని వినియోగంలోకి తీసుకువచ్చి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

విషపురుగులు సంచరిస్తున్నాయి



మా గ్రామానికి ఆనుకుని మట్టపల్లి ముంపువాసులకు పునరావాస కాలనీ కేటాయించారు. ఈ కాలనీలో రోడ్లు, పలు ప్రభుత్వ భవనాలు నిర్మించారు. కాని ఇప్పటికీ బాధితులకు ఒక్క ఇల్లు కూడా నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఖాళీగా ఉన్న స్థలంలో దట్టంగా కంపచెట్లు పెరగడంతో పాములు, తేళ్లు విపరీతంగా సంచరిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది.

– బానోతు రాజునాయక్, సుల్తాన్‌పూర్‌తండా

అందరికీ న్యాయం చేయాలి



పులిచింతల ముంపుతో గ్రామంలోని అందరూ నిరాశ్రయులయ్యారు. ఆనాడు అందరికీ న్యాయం చేస్తామన్నారు. కాని తరువాత కొద్ది మందిని ముంపు కింద గుర్తించి నిర్వాసితులుగా గుర్తించారు. దీంతో గ్రామంలో అందరు వ్యతిరేకించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇప్పటికైనా గ్రామంలోని అన్ని వర్గాల వారికి పునరావాస కేంద్రంలో ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించి నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలి.

– దాసరి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ మట్టపల్లి

జాషువా రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం



సమావేశంలో మాట్లాడుతున్న సాముల శివారెడ్డి

హుజూర్‌నగర్ : దళిత సాహితీవేత్త, కవి గుర్రం జాషువా రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సాముల శివారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాషువా తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరుగుబాటు బావుటా ఎగురవేశాడని అన్నారు. ఛీత్కారాలు ఎదురైన చోటనే సత్కారాలు పొందిన నవయుగ కవి చక్రవర్తి అని కొనియాడారు. అనంతరం నిర్వాహకులు పలువురు ప్రభుత్వ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కస్తాల శ్రవణ్‌కుమార్, జాషువా కమిటీ గౌరవాధ్యక్షుడు బయ్యారపు రామారావు, మాతంగి ప్రభాకర్ రావు, ఎస్.సైదులు, వై.వీరబాబు, ఎం అశోక్, నాగేశ్వరరావు, గురవయ్య, సైదులు. రాము, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వినోదాన్ని అందించేందుకు ఎగ్జిబిషన్‌లు దోహదం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల, లక్ష్మీనారాయణరెడ్డి

కోదాడరూరల్ : వినోదాన్ని అందించేందుకు ఎగ్జిబిషన్‌లు ఎంతగానో దోహదపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, టీపీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన భైరవత్ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు. దసరా సెలవుల్లో పట్టణ, గ్రామీణ ప్రాంత చిన్నారులు, పెద్దలు ఆటవిడుపుకు ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో రంగుల రట్నాలు వంటి వాటితో పాటు అన్ని రకాల షాపింగ్ స్టాల్స్, పక్షులు, తినుబండరాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు జాల వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కందుల కోటేశ్వరరావు, డేగ శ్రీధర్, స్వామి తదితరులు ఉన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు, కోచ్ మాధవీలత

కోదాడరూరల్ : మిర్యాలగూడెంలో నిర్వహించిన 22వ నేషనల్ ఓపెన్ కరాటే, కుంగ్ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో కోదాడకు చెందిన స్టూడెంట్ కోఫో కాన్ కరాటే క్లబ్ విద్యార్థులు సత్తాచాటారు. క్లబ్‌కు చెందిన విద్యార్థులు సాన్విత, కె.శ్రీవీర్ష, ఎస్.నోహిత, పి.ఆరాధ్య, అర్జున్ కార్తికేయ, ఈశ్వరకార్తికేయ, సంధ్య, అఖిల, సిందాలు పలు విభాగాల్లో గోల్డ్‌మెల్స్, నాగరుద్ర, సిల్వర్, మీరాలు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు కోచ్, తెలంగాణ ఇన్‌స్ట్రక్టర్ కోఫోకాన్ ఆరె మాధవిలత ఆదివారం తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులు సుమన్ కోఫోకాన్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా టెక్నికల్ డైరెక్టర్ సైదులు చేతుల మీదగా బహుమతులు అందుకున్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరంలో కంటిపరీక్షలు చేయించుకుంటున్న సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల : స్వచ్ఛంద సంస్థలు, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఉచిత వైద్యశిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మునగాల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త గంధం సైదులు సహకారంతో హైదరాబాద్‌కు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి, ససేలా హెల్త్ సంస్థ నిర్వాహకుడు తల్లాడ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా పరీక్షలు నిర్వహించడమే కాక ఉచితంగా మందులు, ఆపరేషన్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరం ఏర్పాటుకు సామాజిక కార్యకర్త గంధం సైదులు చేసిన కృషిని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కోదాడ కేఆర్‌ఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, రిటైర్డ్ హెచ్‌ఎంలు ఓరగంటి రవి, శాఖమూడి అప్పారావు, సీపీఐ నాయకులు చిల్లంచర్ల ప్రభాకర్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొమ్ము ఈదారావు, యువజన సంఘాల నాయకలు రావులపెంట రాజసింహం, రాయల సతీష్, తంగెళ్ల చిన్న, ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగిఉండాలి



క్రీడలను ప్రారంభిస్తున్న పూర్వ పీడీఎస్‌యూ విద్యార్థులు

కోదాడ : విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత కలిగి ఉండి సమాజంలో జరిగే మంచి చెడులపై స్పందించే గుణాన్ని అలవర్చుకోవాలని పూర్వ పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు రాయపూడి చిన్ని అన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఏర్పడి 50సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం కోదాడ పట్టణంలోని బాలుర పాఠశాలలో ఆ సంఘం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బాలబాలికలకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో జార్జిరెడ్డి అమరత్వంతో ఏర్పడిన పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. నేటి విద్యార్థులు ప్రాశ్చాత్య సంస్కృతి మోజులో పడి ప్రశ్నించే తత్వాన్ని మరిచిపోయారని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. కార్యక్రమంలో పెదనాటి వెంకటేశ్వరరావు, ముత్తవరపు పాండురంగారావు, పార సీతయ్య, పందిరి నాగిరెడ్డి, మట్టారెడ్డి, రాఘవరెడ్డి, హరికిషన్‌రావు, కోటయ్య, మస్తాన్, వీరభద్రం, మల్లయ్య, ఉదయగిరి, నరసింహారావు, చందర్‌రావు, ఎస్‌ఎస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పారేపల్లి శేఖర్‌రావు

నేరేడుచర్ల : కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పి నేటికి పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం, గృహాజ్యోతి పథకం కొంత మేరకు మాత్రమే అమలు అయ్యాయని, రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. అర్హులైన వారందరికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను అందించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కోదమగుండ్ల నగేష్, నాయకులు కుంకు తిరుపతయ్య, నీలా రాంమ్మూర్తి, మీనయ్య, హాఫీజ్, సైదులు, శ్రీను తదితరులున్నారు.

పురుషోత్తమ్‌రెడ్డి మృతికి సంతాపం

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, రాష్ట్ర నాయకులు సాముల శివారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లిఖార్జున్, కౌన్సిలర్ అమరబోయిన సతీష్, వెలిదండ వీరారెడ్డి, దొంతగాని శ్రీనివాస్, వేముల నాగరాజు, గాయత్రి భాస్కర్, యడ్ల విజయ్‌లతో పాటు పలువురు సందర్శించి నివాళులర్పించారు.

సూర్యక్షేత్రం సందర్శన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని సూర్యక్షేత్రాన్ని ఆదివారం నల్లగొండ, సూర్యాపేట, అర్వపల్లి తదితర ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్ర సందర్శనలో భాగంగా సూర్యక్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్ స్వామి మాట్లాడుతూ.. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూర్యక్షేత్ర విశిష్టతను వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘనపురం నరేష్, అర్చకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సామాజికసేవలో ముందుండాలి

- జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



ఎంపికైన మహిళా నూతన కార్యవర్గం

కోదాడ : ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండాలని, మానవసేవే మాధవ సేవ అన్న నానుడిని ఆర్యవైశ్యులు పాటించాలని ఏపీకి చెందిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలో నిర్వహించిన అవోపా 20వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో అన్ని వర్గాల వారికి తలతో నాలుకలాగా ఉండే ఆర్యవైశ్యులు పరులహితాన్ని కోరుకుంటారని, అదే దృక్పథాన్ని కొనసాగించాలని కోరారు. 20సంవత్సరాలుగా అవోపా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాలతో పాటు రాజకీయ రంగాలలో రాణించాలని, ముఖ్యంగా మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం కార్యవర్గంతో ఆయన ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో అవోపా మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వందనపు శిల్ప, చెన్నకేశవరావు, కందిబండ వెంకటేశ్వరరావు, వంగవేటి శ్రీనివాసరావు, లోకేష్, రాంమ్మూర్తి, రాజశేఖర్, కోటేశ్వరరావు, ప్రభాకర్, శ్రీధర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళా కార్యవర్గం ఎన్నిక

పట్టణంలో మున్నూరుకాపు సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం మహిళా పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షురాలిగా రామిశెట్టి కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలిగా ఎం.దేవి, ప్రధాన కార్యదర్శిగా కోట గురులక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బండ్ల ప్రశాంతిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నూనె సులోచన మాట్లాడారు. సామాజిక కార్యక్రమాలతో పాటు మున్నూరుకాపు మహిళల అభివృద్ధి కోసం మహిళా కార్యవర్గం కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సన్నీరు మురళి, వై.లక్ష్మి, చింతలపాటి అరుణ, బండారు ఉమ, ఓరుగంటి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



భరత్‌బాబును సన్మానిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

మునగాల : మండలంలోని జగన్నాధపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న వక్కంతుల భరత్‌బాబు రాష్ట్ర స్థాయి అక్షర ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి అక్షరఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం మండల కేంద్రంలో భరత్‌బాబు విలేకరులతో మాట్లాడారు. ప్రతియేటా అక్షర ఫౌండేషన్ వారు ప్రకటించే అవార్డులలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయుల విభాగంలో తనను ఎంపిక చేసినట్లు తెలిపారు.

డప్పు కళాకారుడు సతీష్‌కు అక్షర ప్రతిభ పురస్కారం



సతీష్‌కు అవార్డు అందజేసి సన్మానిస్తున్న వాసుదేవ్

గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు అమరవరపు సతీష్ సాంస్కృతిక విభాగంలో ఉత్తమ డప్పు కళాకారుడిగా రాష్ట్ర స్థాయి అక్షర ప్రతిభ పురస్కారం అందుకున్నారు. శనివారం రాత్రి సూర్యాపేట పట్టణంలో అక్షర ఫౌండేషన్, ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అక్షర ప్రతిభ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త మీలా వాసుదేవ్, అక్షర ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ యాస రామ్‌కుమార్‌రెడ్డి, ఫౌండేషన్ యాజమాన్యం రాష్ట్రస్థాయి ప్రతిభ పురస్కారాన్ని అందజేశారు. సతీష్ అవార్డు పొందడం పట్ల కుటుంబ సభ్యులు, అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్, గుండ్ల ఆంజనేయులు, వెన్నెల నాగరాజు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నారాయణపురంలో వన మహోత్సవం



వనభోజనాలకు వెళ్తున్న గ్రామస్తులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురంలో ఆదివారం వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులంతా కుటుంబ సమేతంగా కలిసి గ్రామ సమీపాన పొలాల వద్ద వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పల్లా రామిరెడ్డి, దేశబోయిన జానకిరాములు, మండవ చిన్నా, బూర లక్ష్మీనారాయణ, గంధ్ర పూర్ణయ్య, తమ్మనబోయిన నాగరాజు, కీసర బ్రహ్మం, దేశబోయిన రామయ్య తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా కూల్చివేతలను తాత్కాలికంగా నిలపాలి

నేరేడుచర్ల : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి గృహాలను కూల్చివేస్తున్నారని, ప్రస్తుతం కూల్చివేతలను తాత్కాలికంగా నిలపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో కాలంగా అనేక శాఖల అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్నారని, వారిలో ఎక్కువ శాతం పేద, మధ్య తరగతి కుటుంబాల వారే ఉన్నారని అన్నారు. ముందుగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని రాష్ట్ర పరిపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఊదర వెంకన్న, కొమ్మరాజు వెంకట్ తదితరులున్నారు.